క్లుప్తంగా

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రేపు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని ఈనెల 7వ తేదీ నిర్వహించనున్నట్లు మేయర్ అముద ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో జరిగే సమావేశానికి కార్పొరేటర్లతో పాటు కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్–అఫిషియో సభ్యులు తప్పకుండా హాజరుకావాలని ఆమె కోరారు.

మహాధర్నాలో జిల్లా బీసీ నేతలు


మహాధర్నాలో పాల్గొన్న జిల్లా నాయకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం మహాధర్నా తలపెట్టింది. గురువారం జరిగిన ఈ ధర్నాలో జిల్లాలోని బీసీ నాయకులు హాజరయ్యారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని నినదించారు. బీసీల కుల జన గణన చేయాలని, మహిళా రిజర్వేషన్‌లో బీసీ మహిళలకు ప్రత్యేక కోటా కల్పించాలని చిత్తూరు జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జ్ఞాన జగదీష్ డిమాండ్ చేసినట్లు వెల్లడించారు.

నిరాశ్రయులకు ప్రత్యేక వైద్యశిబిరం


వైద్యశిబిరంలో మాట్లాడుతున్న వైద్యులు

చిత్తూరు అర్బన్: నిరాశ్రయులకు సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రత్యేక ఆయుర్వేదిక్ వైద్య శిబిరాలను నిర్వహించి వైద్యసేవలు అందిస్తున్నట్లు జోసెఫ్‌రాజ్ పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని నిరాశ్రయుల వసతి గృహంలో గురువారం ఉచిత ఆయుర్వేదిక్ ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ హరిత, మురళీకృష్ణ నిరాశ్రయులను పరీక్షించి మందులు అందజేశారు.

8 ఎకరాల్లో వరి పంట నష్టం


నేలవాలిన వరిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి ప్రవీణ్

తవణంపల్లె: ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట ఫెంగల్ తుపాను ప్రభావంతో కోత దశలో ఉన్న వరి పంట మండలంలో 8 ఎకరాల్లో నష్టపోయిందని తవణంపల్లె వ్యవసాయాధికారి ప్రవీణ్ తెలిపారు. మండలంలో కొండ్రాజుకాలువ, పైమాఘం, మత్యం, ఈచనేరి, దిగువ మాఘం గ్రామాల్లో సాగు ఉన్న వరి పంట తుపాను తాకిడికి నేలపాలైందన్నారు. వరి గింజలు మొలకెత్తడంతో పంటను పరిశీలించారు. తుపాను ప్రభావంతో నష్టపోయిన వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి 8 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేసి జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు.

సూర్యఘర్‌ను వినియోగించుకోండి


కరపత్రాలను పంచుతున్న డీఈ ప్రసాద్

చిత్తూరు కార్పొరేషన్: పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలని ట్రాన్స్‌కో నగర డీఈ ప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక గిరింపేట పరిధిలో ఈ పథకంపై అవగాహన కోసం వినియోగదారులకు కరపత్రాలను అందజేశారు. ఈనెల 9న నిర్వహించనున్న సూర్యఘర్ మేళాను విజయవంతం చేయాలని కోరారు. ప్రతినెలా 300ల యూనిట్ల విద్యుత్ వినియోగించే వారికి ఈ పథకం ఉపయోగకరమన్నారు. ప్రభుత్వ సబ్సిడీతో వాటిని ఇంటి పైకప్పు మీద ఏర్పాటు చేసుకోవాలన్నారు. వీటి ద్వారా విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చన్నారు. నెట్ మీటర్ ఏర్పాటుతో సోలార్ విద్యుత్ ఉత్పత్తి, వాడకం తెలుస్తుందన్నారు. మిగులు విద్యుత్‌ను శాఖ తీసుకొని ఆ మొత్తం చెల్లింపు చేస్తుందన్నారు. ఏఈ వివేకానందరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడి ఆకస్మిక మృతి

పాకాల: కూరగాయలు తీసుకుని ఇంటికి వెళ్లే క్రమంలో ఆకస్మికంగా వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గురువారం మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా, పి.కొత్తకోట పంచాయతీ పాతమోటకంపల్లికి చెందిన కె.చిన్నస్వామి మందడి(72) ఇంటి నుంచి సుమారు 11 గంటల ప్రాంతంలో పాకాలకు వెళ్లాడు. కూరగాయలు తీసుకుని ఇంటికి రావడానికి బస్సు కోసం వేచి ఉండగా హఠాత్తుగా మృతి చెందినట్లు పోలీసుల నుంచి సమాచారం రావడంతో హుటాహుటిన పాకాలకు వెళ్లి మృతదేహాన్ని తీసుకుకొచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆశలు వరి


ఈచనేరి దగ్గర తుపాను తాకిడికి నేలమట్టమైన వరి పంట


జడివానతో నిర్మానుష్యంగా మారిన ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం


వరి మడిలో మొలకలను చూపిస్తున్న బాధిత రైతు


బురదమయంగా మారిన టి.పుత్తూరు రోడ్డు

తవణంపల్లె: ఫెంగల్ తుపాను ప్రభావంతో నాలుగు రోజులుగా ఎడతెరపిలేని జడివాన కురిసింది. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 28.02 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలంలోని ఈచనేరిలో ఒకటిన్నర ఎకరాలోని వరి పంట పూర్తిగా నేలమట్టమైంది. వరి గింజలు మొలకలు వచ్చి పంట దెబ్బతింది. దిగువమాఘం దగ్గర వరి పంట నేలకొరిగింది. నష్టపోయిన వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపరిహారం అందించడానికి జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ తెలిపారు.

నిర్మానుష్యంగా ప్రభుత్వ కార్యాలయాలు

తుపాను ప్రభావంతో ఎడతెరపి లేని జడివానతో ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలు లేక నిర్మానుష్యంగా మారాయి. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వర్షాల కారణంగా ప్రజలు ఎవరూ రాలేదు. దీనితో ప్రభుత్వ కార్యాలయాల్లో సందడి తగ్గింది. జడివానకు వీధులు బురదమయంగా మారి వాహనదారులకు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ప్రజల ముంగిటకే అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు అర్బన్ మండలంలో శుక్రవారం నుంచి జరగనున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ట్రైనీ కలెక్టర్ హిమవంశీ తెలిపారు. గురువారం చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 6 నుంచి 28వ తేదీ వరకు ఈ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్బన్‌లోని 15 రెవెన్యూ గ్రామాల్లో ఒక్కొక్క రోజు ఒక్కొక్క రెవెన్యూ గ్రామంలో సదస్సులు ఏర్పాటు చేయనున్నారు. బాధితులు వారి రెవెన్యూ సమస్యలను అక్కడ విన్నవిస్తే పరిష్కరిస్తారన్నారు. ప్రజల వద్దకే అధికారులు వచ్చి సమస్యలు వింటారన్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందన్నారు. ఈ సదస్సులో తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వో, దేవదాయ, రిజిస్ట్రేషన్, అటవీ శాఖల అధికారులు సదస్సుకు హాజరవుతారని తెలిపారు. 6న ఎల్‌బీపురం, 10 మాపాక్షి, 11న మాపాక్షి పార్ట్, 12న అనుపల్లి, 13 అనుపల్లి పార్ట్, 17 గిరింపేట, 18న ఇరువారం, 19న మంగసముద్రం. 20న తిమ్మసముద్రం. 21న మురకంబట్టు, 24 దొడ్డిపల్లి, 26న గాండ్లపల్లి, 27వ తేదీ కట్టమంచి, 28న చిత్తూరు, 30న నరిగిపల్లి రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తారన్నారు. సమావేశంలో తహసీల్దార్ కళావతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ హిమవంశీ

దివ్యాంగులపై వివక్ష చూపొద్దు

గుడిపాల: వికలాంగులపై వివక్ష చూపరాదని మండల విద్యాశాఖాధికారి గణపతి తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని గురువారం నరహరిపేట ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో దివ్యాంగులకు, వారి తల్లిదండ్రులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మేనరిక వివాహాలు చేయడం వల్లనే 90 శాతం వికలాంగులుగా పుడుతున్నారన్నారు. అలాగే గ్రామాల్లో ఇప్పటివరకు కూడా కొంతమంది బాల్యవివాహాలు చేస్తున్నారు. దీనివల్ల కూడా పిల్లలు బుద్ధిమాంద్యంతో పుడుతున్నారన్నారు. దివ్యాంగులు మానసికంగా అధైర్యపడకుండా ఆత్మవిశ్వాసంతో అన్నిరంగాల్లో ముందుకు దూసుకెళ్లాలన్నారు. అనంతరం దివ్యాంగులకు పండ్లు, ప్లేట్లను పంపిణీ చేశారు. స్థానిక కంద విలాస్ హోటల్ యాజమాన్యం వచ్చిన వారందరికీ భోజన సౌకర్యాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీ టీచర్‌లు వాణి, భవిత పాల్గొన్నారు.


పండు, ప్లేట్లను పంపిణీ చేస్తున్న ఎంఈఓ

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి పూజలు

తవణంపల్లె: మండలంలోని కొత్తగొల్లపల్లెలో గురువారం అయ్యప్ప స్వామికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కొత్తగొల్లపల్లెలో అయ్యప్ప స్వామి, వినాయక స్వామి, లక్ష్మీదేవికి అభిషేక పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యం సమర్పించారు. అయ్యప్ప భక్తులు ఇరుముడులు కట్టుకొని శబరిమలకు బయలుదేరారు.

వీధి దీపాల నిర్వహణపై పరిశీలన

చిత్తూరు అర్బన్: నగరంలో వీధి దీపాల నిర్వహణను పక్కాగా చేపట్టాలని, విధి దీపాలు లేనిచోట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పి.నరసింహప్రసాద్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి కమిషనర్ నగరంలోని న్యూట్రిన్ ఫ్యాక్టరీ రోడ్డు, ఇరువారం జంక్షన్, ఐటీసీఎల్ క్వార్టర్స్ ప్రాంతాల్లో విద్యుత్ దీపాలను పరిశీలించారు. న్యూట్రిన్ ఫ్యాక్టరీ వద్ద జరుగుతున్న సెంట్రల్ లైటింగ్ మరమ్మతు పనులను తనిఖీ చేశారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేసి లైటింగ్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలన్నారు. కమిషనర్ వెంట కార్పొరేటర్ అశోక్, ఏఈ లోకేష్, వార్డు కార్యదర్శులు ఉన్నారు.

మామిడి కవర్లకు దరఖాస్తు చేసుకోండి

ఐరాల: మండలంలోని మామిడి తోటలు సాగు చేసే రైతులు కాయలకు కట్టడానికి కవర్లు కావలసిన వారు దరఖాస్తు చేసుకోవాలని మండల ఉద్యానవన శాఖ అధికారిణి సాగరిక పేర్కొన్నారు. ఫ్రూట్ కవర్లు కావాల్సిన రైతులు వారికి సంబంధించిన రైతు సేవా కేంద్రాల్లో (ఆర్ఎస్‌కే) కవర్ల సంఖ్య, పాస్‌బుక్, ఆధార్, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌లు సమర్పించాలన్నారు. సీజన్‌కు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కవర్ల ధర నిర్ణయించినప్పుడు ఫోన్ ద్వారా నమోదు చేసుకున్న వారికి తెలియజేస్తామన్నారు. నమోదు చేసుకున్న వారు ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించి జనవరి నెలలో కవర్లను పొందవచ్చన్నారు.

రైతులకు రాయితీతో ఫ్రూట్ కవర్లు

తవణంపల్లె: నాణ్యమైన పంట దిగుబడికి మామిడి రైతులకు ఉద్యానవన శాఖ ద్వారా రాయితీతో ఫ్రూట్ కవర్లు అందజేస్తామని బంగారుపాళ్యం ఉద్యానవన శాఖ అధికారి సాగరిక తెలిపారు. టేబుల్ రకాల మామిడి కాయలకు ఫ్రూట్ కవర్లు కట్టడానికి అవసరమైన రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కవర్లు కావాల్సిన రైతులు భూమి పాస్‌బుక్, ఆధార్, బ్యాంకు పాసు పుస్తకం నకలు ఇచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

బంగారుపాళెం: మండలంలో శుక్రవారం నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బాబురాజేంద్ర ప్రసాద్ తెలిపారు. మండలంలోని 26 రెవెన్యూ గ్రామాల్లో నేటి నుంచి జనవరి 8వ తేదీ వరకు సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 6న మహాసముద్రం, 7న కల్లూరుపల్లె, 10న తంబుగానిపల్లె, 11 నలగాంపల్లె, 12 సదకుప్పం, నల్లంగాడు, 13న గుండ్లకట్టమంచి, 17న పాలేరు, 18న మొగిలివెంకటగిరి (తగ్గువారిపల్లె),19న 170 గొల్లపల్లె(బంగారుపాళెం), 20వ తేదీ తుంబకుప్పం, 21న టేకుమంద, 24న కీరమంద, 26న రాగిమానుపెంట, 27న బొడబండ్ల, కూర్మాయిపల్లె, 28న నూనెగుండ్లపల్లె, బేరిపల్లె, 31న తుంబపాళెం, జనవరి 2వ తేదీ శెట్టేరి, తూంపాయనపల్లె, 3న జంబువారిపల్లె, 4న మొగిలి, పాలమాకులపల్లె, 7న వేపనపల్లె, 8వ తేదీ కేఎంకండ్రిగలో గ్రామసభలు చేపడతామన్నారు. రెవెన్యూ సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

తవణంపల్లె మండలంలో..

తవణంపల్లె: మండలంలో శుక్రవారం నుంచి జనవరి 9వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి అర్జీలు స్వీకరిస్తామన్నారు. శుక్రవారం గోవిందరెడ్డిపల్లెలో రెవెన్యూ సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు.

రేపు మామిడి రైతులకు అవగాహన

బంగారుపాళెం: మామిడిలో యాజమాన్య పద్ధతులపై ఈనెల 7వ తేదీ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఉద్యానశాఖ అధికారి సాగరిక తెలిపారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభం అవుతుందన్నారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సుకు శాస్త్రవేత్తలు హాజరై మామిడి తోటలో పూత, పిందె దశలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తారన్నారు. రైతులు మామిడి సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

ఐరాల: విభిన్న ప్రతిభావంతులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని ఎంపీడీఓ ధనలక్ష్మి పేర్కొన్నారు. గురువారం స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఎంఈఓలు రుషేంద్రబాబు, దామోదర్‌నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ మాట్లాడుతూ దివ్యాంగులు స్వశక్తితో జీవనం సాగించేలా వారికి ప్రోత్సాహం అందించాలన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగుల పట్ల తల్లిదండ్రులు అలసత్వం చూపకుండా భవిత కేంద్రంలో చేర్పించాలని చెప్పారు. ఎంఈఓలు మాట్లాడుతూ ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఏటా డిసెంబర్ 3వ తేదీ నిర్వహిస్తున్నామని, కాగా ఫెంగల్ తుపాను కారణంగా గురువారం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం దివ్యాంగ చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులు, పిల్లలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భవిత కేంద్రం సహిత ఉపాధ్యాయులు కవిత, సురేష్, హెచ్ఎం చాముండేశ్వరి పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

ఈఆర్వోకు మోక్షమెప్పుడో?

- గత ప్రభుత్వ హయాంలో కార్యాలయ మరమ్మతులకు ఆమోదం
- ప్రస్తుతం నిధులు లేమితో పెండింగ్

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధిలోని ఈఆర్వో (ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీసు) కార్యాలయ మరమ్మతు పనులకు మోక్షం లభించడం లేదు. గత డివిజన్ పరిధిలో 12 సెక్షన్లు కలిపి ఒకే విద్యుత్ చెల్లింపుల కేంద్రం ఉండేది. వసతులు లేక కార్యాలయం శిథిలావస్థకు చేరినా ప్రస్తుతం పట్టించుకునే నాథుడే లేదు. రూరల్ ఈఆర్వో కార్యాలయం నిర్మాణ పనులు రూ.57 లక్షలతో, రూరల్ ఈఈ కార్యాలయ మరమ్మతు పనులు రూ.7 లక్షలతో మొదలుపెట్టారు. కానీ చిత్తూరు ఈఆర్వో కార్యాలయంపై శ్రద్ధ పెట్టడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం రూ.కోటితో డివిజన్, ఈఆర్వో కార్యాలయ నిర్మాణ, మరమ్మతు పనులు చేయాలని నివేదిక పెట్టారు. కానీ ప్రభుత్వం మారిపోవడంతో నిధుల కొరతను సాకుగా చూపి ఆ పనులు పక్కన పెట్టింది.

శిథిలావస్థకు చేరిన ఈఆర్వో

వర్షం పడితే తడి చేరే గోడలు, కార్యాలయం ముందు నిల్వ చేరే నీరు, సీలింగ్ లేని వైరింగ్, పెచ్చూలూడిన పైకప్పు, కార్యాలయంలో కారుతున్న నీరు, దెబ్బతిన్న స్విచ్‌బోర్డుల నడుమ 30 మందికి పైగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఎలుక కొరికిన వైర్లు గాలికి రాపిడి జరిగితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. విద్యుత్ వైర్లు బయటికి వెళుతూ దర్శనమిస్తున్నాయి. దీంతో ఉద్యోగులు భయాందోళన నడుమ పనిచేస్తున్నారు.


కూలిపోయే స్థితిలో ఉన్న పీఓపీ సీలింగ్

కొత్తవి సరే.. మరి పాత వాటి పరిస్థితి..?

గత ప్రభుత్వ పాలనలో పాత భవనం అయిన అర్బన్ డివిజన్ కార్యాలయం, ఈఆర్వో కార్యాలయాన్ని నిర్మించాలని రూ.కోటితో ప్రతిపాదనలు పెట్టారు. ప్రస్తుతం నిధులు లేవంటూ ఆ ప్రస్తావనే తేవడంలేదు. గతంలో మంజూరైన రూరల్ ఈఆర్వో కార్యాలయాన్ని రూ.57 లక్షలతో నిర్మిస్తున్నారు. పాత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయనున్న రూరల్ ఈఈ కార్యాలయ మరమ్మతు పనులు రూ.7 లక్షలతో చేస్తున్నారు. అవిపూర్తయ్యే వరకు రూరల్ డివిజన్ ఉద్యోగులు ఎస్ఈ కార్యాలయంలో సర్దుకొని పనిచేస్తున్నారు. ఇన్నిరోజులు ఈఈ కార్యాలయం లేకపోవడంతో అధికారులు గిరింపేటలోని ఆ శాఖ గెస్ట్‌హౌస్ నుంచే పాలన సాగించే దుస్థితి ఏర్పడింది.

2026లో అయ్యేనా..?

ఏది చేయాలన్నా బడ్జెట్ లేదని విద్యుత్‌శాఖాధికారులు అంటున్నారు. నిధులు లేకుండా పనులు చేయడం సాధ్యం కాదు. దీనికి తోడు కోటి రూపాయలు కొత్తగా ఏర్పడిన జిల్లాలో డివిజన్, ఈఆర్వో కార్యాలయానికి కేటాయిస్తారా లేదా అని తెలియడం లేదు. పోనీ నిధులు వచ్చినా పనులు ప్రారంభించి పూర్తి చేయడానికి మరో సంవత్సరం పడుతుంది. అంటే అనుకున్నవనీ జరిగితే పనులు పూర్తవ్వడానికి 2026 సంవత్సరం వరకు వేచి చూడాల్సిందే.


ఈఆర్వో కార్యాలయం


వేలాడుతున్న విద్యుత్ వైర్లు



వర్షానికి సీలింగ్‌లో చేరిన తేమ

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. గురువారం మండలంలోని ఇరువారంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 55 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది అందించే ఐరన్ మాత్రలు విధిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు


వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ చంద్రమహేష్

గుడిపాల: ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు పైసా ఖర్చులేకుండా, సమయం వృథా కాకుండా ఇంటివద్దే వైద్య సేవలు అందుతున్నాయని గుడిపాల పీహెచ్‌సీ డాక్టర్ చంద్రమహేష్ అన్నారు. వసంతాపురం గ్రామంలో గురువారం ఆయన ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శిబిరం ఏర్పాటుచేసి ఓపీ సేవలందించారు. 50 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులతో మంచంపైన ఉన్న రోగులకు వైద్యపరీక్షలు చేశారు. వైద్య సిబ్బంది జబసెల్వి, సరస్వతి, చంద్రశేఖర్, ఉమామహేశ్వరి, సుజిమ, స్వప్న పాల్గొన్నారు..